# కోలాటం, జడ కోలాటం

కోలా అంటే కర్ర, ఆట అనగా ఆడుట లేక నృత్యం చేయుట. అనగా కర్రలతో ఆడుకునే ఆట కోలటం. కోలాటం ఆంధ్రదేశంలోనే కాదు భారతదేశం మొత్తంలో ప్రసిద్ధిగాంచింది. గుజరాతీ భాషలో "దండియారాస" అని "గర్బ" అని రాజస్థానీలోనూ అంటారు. కొన్ని శతాబ్దాలనుండే ఈ కళ ఉన్నట్లుగా దేవుని మందిరంలోని శాసనాల ద్వారా తెలియచున్నది, మరియు మహాబలిపురం, బిక్కవోలు, ద్రాక్షారామం, సామర్లకోట, మాచర్ల, శ్రీశైలం మరియు హంపి దేవస్థానకుడ్యములపై కోలాటపు భంగిమలు ఉన్న మూర్తులు చెక్కబడినవి. శ్రీయుతులు పాల్కురికి సోమనాథుడు, తిక్కన, నాచనసోమన, వినుకొండ వల్లభరాయ, శ్రీనాథ, రఘునాథరాయ, అయ్యలరాజు నారాయణామాత్య మొదలైన కవులు వారి రచనలలో కోలాటాన్ని గ్రామంలో ఒక క్రీడగా ఆ రోజులలో ఉండేదని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామంలోని ఉత్సవాలలో ఈ కోలాట ప్రదర్శన ఉండేదని వారి రచనలో తెలియచేసినారు. శ్రీ అన్నమాచార్యులవారు చాలా కోలాటం పాటలను రచించినారు. అన్నమయ్య కీర్తనలు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆరాధనలోనూ ప్రత్యేక ఉత్సవములసమయంలో పాడుకొందురు. కావున ఈ కోలాటపు పాటలకు ఉత్సవాలకు అవినాభావ సంబంధమున్నట్లు తెలుస్తోంది.



కోలాట బృందంలో 8 నుండి 40 మంది వరకు కళాకారులు ఉంటారు. ఒక నాయకుడు ఉంటాడు. ఆయనను గురువు అని అందురు. కోలాటంలో ఆవలివాని కర్రనుకొట్టువానిని "రాముడు" అని ఎవరి కర్రనైతే కొట్టబడినదో వారిని "లక్ష్మణుడు" అని అందురు. వివిధ కోణాలలో చేయు కోలాటాలను కోపు అందురు. కోలాటంలో 50

కోపులదాకా ఉన్నవి. ఒక్కొక్క కోపు ఇంకొక కోపుకు తేడా ఉండును. అందరు కళాకారులు వృత్తాకారంలో నిలబడి కోలాటాకీ మొదలు పెట్టెదరు. గరువు వాద్యకారుల బృందాలు మధ్యలో నిలబడుతాడు. కోలాటానికి హార్మోనియం, మద్దెల, ఫ్లూటు, క్లారినెట్ వాద్యసహకారములుంటాయి.

శ్రీ గణపతి స్తోత్రమైన "శివశివమూర్తివి గణనాధా" అనే పాటతో కార్యక్రమం మొదలగును. తరువాత అమ్మవారి స్తోత్రము "అంబాబ్రోవుమా",.... జగదంబాబ్రోవుమా" అని పాడుచూ కోలాట నృత్యం చేస్తారు. గురువు చరణం పాడగా అందరు కళాకారులు ఆ చరణాన్నే అందుకొని వృత్తాకారంగా తిరుగుతూ నృత్యం చేయుచూ పాడెదరు. ప్రతిపాటకు "ఎత్తుగడ" (మొదలుపెట్టటం) "ఉసి" (వేగము పెంచటం) మరియు ముక్తాయింపు (ముగింపు) ఉండును. వీరి ఆహార్యం, ధోతి, కాళ్ళకు గుజ్జెలు, తెల్లచొక్కా, మెడకు జేబురుమాలా ఉండును..



జడకోలాటం : 13 మంది నృత్యకళాకారులు, ఒక పాటపాడే ఆయన, డప్పువాయించే వాద్యకారుడు మొత్తం బృందం కలసి 15 మంది ఉంటారు. కొమ్మకు వేలాడతీసిన తాళ్లను పుచ్చుకొని పాటపాడుతూ జడలా అల్లుతారు. అలాగే జడను పాటపాడుతూ ఊడదీస్తారు.

జడ కోలాటం విజయనగరం, కడప, అనంతపురం మరియు వరంగల్ జిల్లాలలో ఎక్కువగా ఆదరణ లభిస్తోంది. సాధారణంగా కళాకారులందరూ స్త్రీలు ఉంటారు. గురవు, వాద్యకారుడు పురుషులు ఉంటారు.